చూపు లేనివాళ్లు ఏనుగును చూడడానికి వెళ్లడం గురించి కథ చెపుతారు. ఒకడు తొండం నిమిరి ఏనుగంటే లావుపాటి పాములాగుంటుంది అన్నాడట. మరొకడు దాని కాళ్లను తాకి చూచి ఏనుగు స్తంభంలాగుంది అన్నాడు. మూడోవాడు ఏనుగు తోకను పట్టుకుని ఇది మరి చీపురు లాగుందన్నాడట. వాళ్లకంటే పాపం కళ్లు లేవు. తాకి చూచిందే ప్రపంచమనుకున్నారు. కళ్లు ఉన్నవాళ్లు ఎంత బాగా చూడగలుగుతున్నారనేది అసలయిన ప్రశ్న. అసలీ ప్రపంచంలో ఒక వస్తువు ఏ ఇద్దరికీ ఒకేలా కనిపించదు. ఒక కారణం కళ్లయితే ఇందుకు మరో కారణం చూపు. కళ్లున్నంత మాత్రాన చూపు ఉందని అనడానికి లేదు. అందరికీ ఏవేవో కనిపిస్తే అర్జునినికి మాత్రం చెట్టు మీద పిట్ట, దాని కన్ను మాత్రమే కనిపించాయంటారు మరి. మనకు ఒక క్షణంలో ఒక దృశ్యంలో ఎన్నో వివరాలు కనపడుతుంటాయి. కానీ వాటన్నిటినీ మనం చూడనే చూడము. అవసరమనిపించిన చోట మాత్రమే దృష్టి కేంద్రీకృతమయి ఆ అవసరమయిన విషయమొకటే కనపడుతుంది. ఖర్మం బాగలేకుంటే అది కూడా కనపడదు. కనిపంచడం ఒక ఎత్తయితే అందులో అంశాలను గుర్తించడం మరో ఎత్తు.

పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా అనే నవలలో గోపీచంద్ గారు ఒక అద్భుతమయిన సంఘటన గురించి రాశారు. అరవిందాశ్రమంలో మాతా అరవిందులను దర్శించుకోవడానికి అంతా వెళతారు. వరుసలో నిలబడి ఒక్కొక్క గదిలోనుంచీ ముందుకు సాగుతుంటారు. గదుల్లో అలంకారాలు చిత్తరువులూ విగ్రహాలు ఉంటాయి. చూస్తూ ముందుకు సాగి పోతారు. బయటకు కూడా వచ్చేస్తారు. ఏదీ అరవిందులు అన్న అనుమానం ఒక వ్యక్తికి కలుగుతుంది. ఫలానా నంబరు గదిలో మాతా అరవిందులు సోఫాలో కూచునున్నారు చూడనే చూచావు గద అంటారు పక్కనున్నవారు. వారిద్దరూ ఎవరినీ పలకరించింది లేదు. ఎవరూ వారికి ప్రత్యేకంగా దండం పెట్టిందీ లేదు. బొమ్మలా కూచున్నవాళ్లు ఊ మనిషికి బొమ్మల్లాగే కనపడ్డారు. అదీ కథ. ఏదో ఊహించుకుని పోతే అక్కడ ఆ ఊహకు సమంగా విషయం కనపడకపోతే మరి అలాగే ఉంటుంది. చిన్నప్పుడు నన్ను తిరుమలకు తీసుకుపోయారు. అక్కడ అన్నీ గుళ్లే అంతటా పెరుమాళ్లే. పోయిన ప్రతి చోటా దండం పెట్టడం ప్రసాదమేదయినా దొరికితే తినడం. దేవుడంటే బోలెడంత భక్తి మరో బోలెడంత భయమూ ఉన్నవయసది. తిరుమలలో ఇప్పుడున్నంత అట్టహాసమూ ఉండేది కాదనుకుంటానప్పట్లో. చివరకు మరో గుడిలోకి వెళ్లొచ్చాము. బ్రహ్మాండమయిన పులిహోరనో చక్కెరపొంగలో దొరికింది. తిన్నాను. ఇక గదికి పదండన్నారు పెద్దలు. అమాయకత్వం పట్టలేక మరి వెంకటేశ్వర స్వామిని చూడొద్దా అని అడిగాను. ఇందాక చూచిందెవరిని అని ఎవరో తిట్టినట్టు కూడా గుర్తుంది. నాకు బహుశః వెంకటేశ్వర స్వామి అంటే అదేదో చాలా పెద్ద ఊహ ఉండి ఉంటుంది. చీకట్లో కనిపించిన స్వామి నా కంటికి ఆనలేదు. నాకప్పట్లో ఆ తర్వాత ఏమనిపించిందో గుర్తు లేదు. తెలియని వారిని గుర్తించకపోతే తప్పు పట్టడానికి లేదు. ఒక్కో సారి తెలిసిన వారిని కూడా గుర్తించలేకపోతాము.

మనిషి దూరంగా లేకున్నా మనసుకు దూరమయితే గుర్తించడం కష్టమవుతుంది. అందుకే ఏ విషయాన్ని ఎంత దూరంనుంచి చూడాలో అంత దూరంనుంచి చూస్తేనే సరిగా కనబడుతుంది. దూరాన ఎవరో వస్తుంటారు. ఎవరో తెలియదు. కొంత దగ్గరగా వచ్చిన తర్వాత నడక దుస్తులు మొదలయినవాటిని గమనించి ఫలానా వారనుకుంటాము. ఇంకా దగ్గరకు వస్తే గానీ ఆ అనుకున్న సంగతి నిజమా కాదా అన్నది నిర్ధారణ అవుతుంది. అంత దూరంలో ఉండే మనిషి గురించి ఆలోచన అతడిని గుర్తించినందుకు

మాత్రం కాదు. ఇంతకు ముందరి అనుభవం ప్రకారం అటువంటి నడక దుస్తులు మనకు తెలిసిన ఒకానొక వ్యక్తికి ఉండేవన్న బావన మాత్రమే ఆ ఆలోచనకు ఆధారం.

చేతిని వీపు వెనకాల దాచుకుంటే కళ్లకు సంబంధించినంత వరకు ఆ చెయ్యి లేనట్టే. చెయ్యి ఉందన్న సంగతి మనసుకు మెదడుకు మాత్రమే తెలిసి ఉంటుంది. అదే చేతిని ముందుకు చాచి అరచేతిని చూడడానికి ప్రయత్నం చేస్తే కనిపిస్తుంది గానీ వివరాలు తెలియవు. అరచేతిని ముక్కుకానించుకుని రెండు కళ్లూ విప్పార దీసి చూస్తే ఒక్క క్షణం చేయి లేదేమోనన్న అనుమానం కలగక మానదు. అదే చేతిని అడుగు దూరంలో కళ్ల ముందుంచి చూస్తే గీతలు రాతలు కూడా వివరంగా తెలుస్తాయి. రూపాయ బిళ్లను ఒక వేపునుంచి చూస్తే బొమ్మ కనబడుతుంది. అటువేపునుంచి చూస్తున్న వాళ్లు మాత్రం మాకు బొమ్మకనిపించడం లేదంటారు. అదే రూపాయ బిళ్లను బొమ్మా బొరుసు కాకుండా మందం కనిపించే దిక్కునుంచి చూడండి. బొమ్మా ఉండదు. బొరుసూ ఉండదు. సన్నని కాగితమయితే నిజంగా మందం మాత్రమే తెలిసే దిక్కునుంచి చూడగలిగితే అసలు కాగితం లేదేమోననే చోటికి చేరుకుంటుంది పరిస్థితి. తొత్తానికి వి,యం ఏమిటంటే ఉన్నది కనపడదు. కనపడింది ఉన్నదో లేదో తెలియదు. ఉన్నది కనపడనంత మాత్రాన అది లేదనడమూ కుదరదు.

కూచున్న మనిషికి తన ముందుండే దృశ్యమొకటే కనబడుతుంది. ఉండే ప్రపంచమంతా ఇంతేనేమో అనుకుంటే అందులో ఎవరిది తప్పని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. లేచి నిలబడితే కనిపించే పరిధి పెరుగుతుంది. అందుకే సారే జహాసె అచ్ఛా పాట రాసిన కవి అల్లామా ఇక్బాల్ ఖుదీ కొ కర్ బులంద్ అంటాడు. గదిలో తిరుగుతిన్న చీమకు బండలు పరిచిన తీరులో ఒక క్రమముందని తెలియదు. పాకే పాపకు కూడా ఆ సంగతి అర్థం కాదు. లేచి నిలబడి అన్ని బండలనూ ఒకే సారి పరికించడం చేతయితేనే వాటిలోని క్రమం తెలుస్తుంది. కూచున్న మనిషి లేచి నిలబడితేనే పరిధి పెరిగితే మరింత ఎత్తులకు చేరుకుంటే ఏమవుతుంది? కనిపించలేదు కనుక లేవేమోననుకున్న సంగతులన్నీ ఉన్నాయని అర్థమవుతుంది. విమానంలోనుంచి చూస్తే నగరమంతా బొమ్మల కొలువులాగా ఇళ్లన్నీ సరదాకు కట్టుకున్న పిచ్చిక గూళ్లలాగా కనబడతాయి. ఇంకా ఎత్తుకు పోయి పరిశీలించే ఉపగ్రహం దృశ్యాన్ని గమనిస్తే అదొక చిత్ర పటంలాగుంటుంది. చూపులో ఇంత తేడా ఉందని ఇన్ని రకాలుగా చూస్తే గానీ అర్థం కాదు.

ఇదంతా భౌతిక ప్రపంచం గురించిన వ్యవహారమయితే ఇంచుమించు ఇవే సూత్రాలు మానసిక ప్రపంచం విషయంలోనూ వర్తిస్తాయి. మనవారు మనకు మంచివారుగానే కనబడతారు. వారు తప్పు చేసినా అది మనకు అంత తప్పుగా కనబడదు. అదే మన మనసుకు అంతగా దగ్గర కాని వారు ఏంచేసినా అది మన కంటికి స్ఫుటంగా కనబడుతుంది. అంటే మనవారి గురించి మనం గమనించేటప్పుడు అరచేతిని ముక్కుకు ఆనించి చూచినట్లు మరీ దగ్గరనుంచి చూస్తున్నామని కదా అర్థం. అందుకే వివరాలు విషయాలు సరయిన తీరులో కనబడలేదు. ఏ విషయాన్నయినా లేక వస్తువునయినా సంపూర్తిగా చూడాలంటే దాన్నుంచి మనం నిలబడ వలసిన సరయిన దూరం ఒకటి ఉంటుంది. మనవారినుంచీ చివరికి మననుంచి మనం కూడా ఒక్క క్షణం ఈ రకంగా కొంత దూరం పోయి చూడగలిగితే అసలు విషయం కళ్లకు కట్టినట్లు కనబడుతుంది. చర్చలో ఎప్పుడూ మనకు మనం చెప్పేదే సత్యమనీ ఇంకొక రకంగా వాదించడానికి వీలే లేదని అనిపించడానికి మన మీద మనకుండే నమ్మకం కారణం. అది మననుంచి మన మనసుకుండే చేరువ తనమని చెప్పవచ్చు. ఒక్క క్షణం మననుంచి మనం దూరం జరిగి ప్రత్యర్థినీ మనలనూ ఒకే స్థాయిలో నిలబెట్టి చూడగలిగితే తీరే మారిపోతుంది. మనలను మనం నిజమనుకోవడం ఎంత సమంజసమో మరొకరు తమ గురించి అలాగే అనుకోవడమూ అంతే సమంజసం కదా!

కె.బి.గోపాలం